
వి.ఆర్.ఎస్.తో వింత
అంబిల్ల జనార్ధన్

**“ఏమండీ! టిఫిన్ చేయడం అయిందిగా, కాస్త బజారుకెళ్ళి రెండు మూడు కాయగూరలు తెండి. అబ్బాయి, కోడలు పిల్ల లంచి దబ్బా లకి కూరలు వండాలి, ఫ్రిజ్జులో బొత్తిగా కూరలు లేవు.”**

**భార్య వైపు ఓ చూపు చూసి సంచీ తీసుకుని బయలుదేరాడు సుధామ.**

**కావలసినవి కొనుక్కుని తిరిగి వస్తుండగా, అదే వీధిలో ఉంటున్న పేకాట మిత్రుడు భూపతి కలిశాడు.**

“ఏమోయ్! బ్రీఫ్‌కేస్ స్థానంలో కూరల సంచీ వచ్చిందా? నేను చెప్పలేదూ? ఖాళీగానే ఉన్నావుగా, పేకాటకి రావడంలేదేం?”

“పేకాట ఆడనని మా ఆవిడకి మాట ఇచ్చాను. ఇప్పుడు హడావిడిలో ఉన్నాను. తర్వాతెప్పుడైనా తీరిగ్గా మాట్లాడుకుందాం” అని పరుగులాంటి నడకతో ఇంటివైపు అడుగులు వేశాడు సుధామ.

“అబ్బ. ఇంత ఆలస్యం చేశారేమండీ? ఆఫీసరు అసలే చండశాసనుడు. మహతి తెగ ఆందోళన పడుతోంది” చేతిలోని సంచీ లాగుకుంటూ అంది రాజ్యం. “నాన్నా టెలి ఫోను బిల్లు కట్టడానికి ఇవాళే ఆఖరి రోజు. ఈ చెక్కు తీసుకుని టెలిఫోను ఆఫీసులో కట్టండి” మనోహర్ టెలిఫోన్ బిల్ చెక్కు ఇచ్చాడు.

“ఏమిటీ, వీళ్ళ ఆగడం? స్టేట్ బ్యాంక్‌లో మానేజరు గిరీ చేసినవాణ్ణి పట్టుకుని, కూరలు తెమ్మంటారా? బిల్లులు కట్టమంటారా? తను పదవిలో ఉన్నప్పుడు ఇలాంటి చిల్లరపనులు చెప్పే ధైర్యం చేశారా వీరు?” మనసులో ఉడుక్కున్నాడు సుధామ.


ఓ అరగంట పేపరు తిరగేసి, ఉస్సూరు మంటూ టెలిఫోను బిల్లు కట్టడానికి, బయటకు నడిచాడు సుధామ. టెలిఫోన్ ఆఫీసులో చాంతాడంత క్యూ ఉంది. పనివాళ్ళు ముసలి వాళ్ళు, కొందరు ఆడవాళ్ళు ఉన్న ఆ క్యూలో, ఎవరూ తన హోదా వాళ్ళు కనబడ లేదు సుధామకి.

అలాంటి వాళ్ళతోపాటు క్యూలో నుంచో వడం నామోషీ అన్పించింది, కానీ తప్పదు కదా!

ఇంటికొచ్చేటప్పటికి భోజనం వేళ అయింది. భోజనానికి కూర్చుంటే? ఒక్క పప్పు తప్ప అన్ని పదార్థాలూ చల్లగా ఉన్నాయి.

“అన్నీ చల్లనివే వడ్డించకపోతే, కాస్త వేడి చేయలేవా?”

## వైద్యరంగంలో జలగలు



**ఒ**క ఫ్రెంచి కంపెనీ అమెరికాలో జలగలు అమ్మడానికి ఆ ప్రభుత్వం నుండి అనుమతి పొందిందిట. దేనికో తెలుసా? వాటిని రక్తానికి సంబంధించిన వ్యాధుల చికిత్సలో ఉపయోగించటానికి. అమెరికాలో డాక్టర్లు జలగల మహిమ ఇప్పుడిప్పుడే గుర్తిస్తున్నారట. అందుచేత వైద్య విధానా లలో వీటి ప్రయోగం ఎక్కువయింది. దీని వలన జలగలకు గిరాకీ పెరిగిపోయింది. శస్త్ర చికిత్స అవసరం లేకుండా వీటి సహా యంతో రోగులకి సురక్షితంగా చికిత్స చెయ్య వచ్చునని డాక్టర్లు గుర్తించారట. నిజానికి ఈ జలగల ఉపయోగం మనదేశంలోనే ప్రథ మంగా ఆయుర్వేదంలో గుర్తింపబడినదని చెప్పవచ్చు. మన ఆయుర్వేద శాస్త్రాలు వీటి విలువ ఏనాడో గుర్తించి శస్త్రచికిత్సలలో విరి విగా వాడేవారని అందరికీ తెలిసిన విష యమే. జలగలే కాక మగ్గట్స్ బల్లులు కూడా ఆయుర్వేదంలో ఉపయోగించేవారు. చెడు రక్తాన్ని తొలగించడానికి జలగలచే దానిని పీల్చుకునేట్లు చేసేవారు.

**– వి.కె. మోహన్**

“అన్నం, కూరలూ, మాటిమాటికి వేడి చేయడమే నా పని అనుకున్నారా? నేను చద్ద న్నం తినగా లేంది, మీరు కాస్త చల్లబడినవి తింటే తప్పా? ఏదో సర్దుకుపోండి. తను ఆఫీ సుకు వెళ్ళేప్పుడు వేడిగా ఉండాలని హాట్ ప్యాక్‌లో అన్నీ సర్ది ఇచ్చిన రాజ్యమేనా ఇలా మాట్లాడుతోంది? రాత్రి డిన్నరుకు కూడా అన్నీ వేడిగా వడ్డించిన తన భార్యేనా ఈమె? అన్యమనస్కంగానే భోజనానికి కూర్చున్నాడు సుధామ. వంటకాలు రుచిగానే ఉన్నా, మనసు బాగా లేకపోవడం వల్ల, ఏదో గతికి, చేయి కడుక్కున్నాడు. పరుపుపై వాలాడు కాని నిద్ర దరిచేరడం లేదు. తను వి.ఆర్.ఎస్. తీసుకుని తప్పు చేశాడా?

మొదటిసారిగా అంతర్మథనం మొదలైంది. ఆఫీసులో సర్క్యులర్ రాగానే అందరికంటే ముందు అప్లై చేశాడు తను. చేయడూ మరి! ఇంకా మిగిలి ఉన్న ఎనిమిదేళ్ళ సర్వీసుకాలం మొత్తానికి జీతం ఇస్తున్నారాయె. పనిచేయ నక్కర లేకుండా హాయిగా ఇంట్లో కూర్చుని జీతం తీసుకోవడం ఎంత సుఖం? నిలువ ఉన్న సెలవులకు జీతమేకాక టాక్స్, రాయితీలు కూడా. ఆ మొత్తం బ్యాంక్‌లో వేస్తే నెలనెలా వడ్డీ. ఇక పెన్షను ఉండనే వుంది. ఇంత ఆకర్ష ణీయమైన ప్యాకేజీ ఎలా వదులుకునేది? అంతే గాక పెరుగుతున్న ఆఫీసు బాధ్యతలు. బ్యాం కులో ఎప్పుడు ఏ లోను నిరర్థకం (ఎన్.పి.ఎ) అవుతుందో తెలియదు. ఆ అప్పులు మంజూరు చేసినందుకు సంజాయిషీలు, ఇంక్వైరీలు. అదో తలనొప్పి వ్యవహారం. కొందరు అవినీతి పరుల పుణ్యమా అని, బ్యాంకుల్లో ఎన్నో కుంభకోణాలు జరుగుతున్నాయి. తను వాటికి దూరంగా ఉన్నా మన మేనేజరుగిరిలో ఏమైనా అవకతవకలు జరిగినట్టు తేలితే, తనదే బాధ్యత.

ఒకప్పుడు బ్యాంకు మేనేజరు అంటే సమాజంలో బాగా గౌరవం ఉండేది. ఈ మధ్య బయటపడుతున్న ఫ్రాడ్‌లవల్ల బ్యాంకు మానే జర్లను అనుమానంగా చూస్తున్నారు. స్వచ్ఛంద పదవీ విరమణతో ఈ ఇబ్బందుల నుంచే కాకుండా మూడేళ్ళకొకసారి వచ్చే బదిలీల నుండి కూడా విముక్తి లభిస్తుంది. ఇవన్నీ ఆలో చించి అప్పుడు వి.ఆర్.ఎస్.కు సై అన్నాడు. ఇప్పుడు? అలా ఆలోచిస్తూ నిద్రపోయాడు సుధామ.

❋ ❋ ❋

నిద్రలేచే సరికి సాయంత్రం ఆరు

గంటలు. ఓ గంట టీ.వీ.చూశాడు. ఏ ఛానెల్ నొక్కినా అవే అర్థంలేని ప్రోగ్రాములు. బోరు కొట్టింది. సంగమేశ్వర్‌తో పిచ్చాపాటీకి బయలుదేరాడు సుధామ. అదృష్టవంతుడు! తనలా వి.ఆర్.ఎస్. తీసుకోలేదు.

అప్పుడే ఆఫీసునుంచి వచ్చినట్టున్నాడతను. వేడి పకోడీలు, టీ సేవిస్తూ టీ.వీ. చూస్తున్నారు సంగమేశ్వర్ దంపతులు.

సుధామకు తను ఉద్యోగంలో ఉన్న రోజులు జ్ఞప్తికి వచ్చాయి. తను ఆఫీసునుంచి రాగానే రాజ్యం ఇలాగే టీ, టిఫిను ఇచ్చేది. ఇద్దరూ హాయిగా కబుర్లు చెప్పుకుంటూ టిఫిన్ చేసేవారు. ఇప్పుడు? రెండు మూడు సార్లు అడిగితే గాని టీ నీళ్ళకు కూడా గతిలేదు.

"రా, రా, సుధా! సమయానికి వచ్చావు. ఓ చేయి వెయ్యి" అని పకోడీల ప్లేటు ముందుకు జరిపాడు సంగమేశ్వర్.

"థ్యాంక్స్ సంగం! నేనిప్పుడే బాగా మెక్కి వస్తున్నాను" బొంకాడు సుధామ.

"ఫరవాలేదు. రెండు పకోడీలు తింటే, నీ కొలెస్ట్రాలు పెరగదు" బలవంతంగా ఓ పకోడి తీసుకున్నాడు సుధామ.

ఇద్దరు మిత్రులు కలిసి దగ్గరిలోని పార్కుకు బయలుదేరారు.

"చెప్పు సుధా ఎలా ఉంది నీ స్వచ్ఛంద 'హాయి' జీవితం".

"నువ్వు తెలుగు 'హాయి' అంటున్నావుకాని, నాకు హిందీ 'హాయ్' అనాలనిపిస్తోంది. నీ మాటలు పెడచెవిన బెట్టి వి.ఆర్.ఎస్. తీసుకున్నందుకు తగిన శాస్తే జరుగుతోంది. నువ్వన్నట్లు పదవి ఉంటేనే మనిషికి విలువ. అది లేకపోతే ఇంట్లోవాళ్ళు, బయటివాళ్ళు, అందరూ చులకనగా చూస్తారు."

"ఇప్పుడేమయిందని?"

"ఏం కాలేదనడుగు. నా ముప్పై ఏళ్ళ సర్వీసులో ఎప్పుడూ చేయని చిల్లర పనులు ఇప్పుడు చేయాల్సి వస్తోంది. కాదంటే ఎలాగూ ఆఫీసు లేదుగా, ఈ మాత్రం ఇంటి పనులు చేస్తే అరిగిపోతారా, కరిగిపోతారా అని రాజ్యం విసుర్లు. ఏదో పనిమీద మన బ్యాంకికి వెళితే? ఎవరూ పలకరించిన వాళ్ళు లేరు. ఒకప్పుడు నా క్రింద క్లర్కుగా ఉన్నతను మానేజరుగా ఉన్నాడు. ఎవరో క్లైంట్‌తో కబుర్లు చెబుతూ నన్ను చూశాడు. కానీ, పలకరింపుగా నవ్వనైనా లేదు. నా అకౌంటు విషయంలో కలుసుకోవాలని చీటీ పంపించి అరగంట వేచి ఉండాల్సొచ్చింది. నాకు తలకొట్టేసినట్లైంది. అదే నేను జోనల్ ఆఫీసులో మేనేజర్గుగా వున్నప్పుడు, బ్రాంచికి వెళితే? అంతా సార్! సార్! అని పలకరించేవారు. కూల్‌డ్రింక్ తెప్పించి మర్యాద చేసేవారు. జోనల్ ఆఫీస్‌లోని తమ పెండింగ్ విషయాలు చూడమనేవారు. ఇంకా ఎనిమిదేళ్ళ సర్వీసు ఉన్నా ఎందుకు వి.ఆర్.ఎస్. తీసుకున్నానా? అని అనుక్షణం పశ్చాత్తాపపడుతున్నాననుకో"



## అడవి కన్య

అడవి నిడివికి
జలపాతాల నవ్వులు సాక్షి
పచ్చదనాలకు
గాలి తోడుగా వసంతపు పాట
మబ్బుల లయల సయ్యాట
కొమ్మ కొమ్మన పుప్పొడుల
రంగు ముగ్గులు
రెమ్మరెమ్మన పత్రహరితాల
పరవళ్ళు
కోయిలమ్మల రసరమ్య గీతాలు
కుహూకుహూ శ్రావ్య సంగీతాలు
వెదురుబొంగులు సైతం
గాలికి తలూపితే చాలు
అడవంతా స్వచ్ఛమైన
ప్రతిధ్వని
హంగుల ఆడంబరాలతో
పట్టుచీర కట్టుకున్న
అడవికన్య!

– గుడిమెట్ల
గోపాలకృష్ణ

"బాధపడకు సుధా! ఈ విషయాలు నీకు ముందే చెప్పాను. అప్పుడు నన్ను ఓ పిచ్చోడిగా చూశావు. చట్టబద్ధంగా, అప్పనంగా వచ్చే డబ్బును కాలదన్నే అవివేకినని హేళన చేశావు. మనిషికి డబ్బే కాదు, సమాజంలో గౌరవం కూడా ముఖ్యమే. హోదావల్ల అది సులువుగా అందుతుంది. కేవలం ఆర్థిక అంశాలను పరిగణనలోకి తీసుకుని ఇంకా వున్న ఎనిమిదేళ్ళ సర్వీసును వదులుకున్నావు. ఇప్పుడిలా మథనపడుతుంటే ఆరోగ్యం పాడౌతుంది. అందుకని ఎలాగైనా సర్దుకుపోవడం అలవాటు చేసుకో. రాత్రయింది. రేపు నేను ఆఫీసుకు వెళ్ళాలి. నీలా ఉదయం పదిగంటల వరకు పడుకునే వీలులేదుగా! పద వెళదాం" పార్కునుండి బయటపడి ఇద్దరూ తమ తమ ఇళ్ళవైపు మళ్ళారు.

❋ ❋ ❋

"బెడ్‌రూంలో కళ్ళజోడుంది తీసుకురా రాజ్యం"

"అబ్బబ్బ, మీరు వి.ఆర్.ఎస్. తీసుకోవడం కాదు కాని, అది నా ప్రాణాని కొచ్చింది. దినమంతా ఇంట్లోనే ఉంటూ, అదితే, ఇదితే, అని నన్ను వేధించకపోతే మీరే తీసుకోవచ్చుగా.

మీరు ఉద్యోగంలో ఉన్నప్పుడే బావుండేది. ప్రొద్దుననగా వెళ్ళినవారు ఏ రాత్రికో వచ్చేవారు. అప్పుడు నాకు పగలు కాస్త కునుకు తీసే వీలన్నా చిక్కేది. ఇప్పుడదేం లేదు. నా టైమంతా మీకు సేవ చేయడంతోనే సరిపోతోంది. ఇప్పుడు నేనేమైనా ఖాళీగా ఉన్నానా?" వంటింటి నుంచే జవాబులాంటి ప్రశ్న. మళ్ళీ పాత రోజులు జ్ఞప్తికి వచ్చాయి సుధామకు.

తన నోట్లోంచి మాట వచ్చింది ఆలస్యం, క్షణాల్లో అడిగినవన్నీ వచ్చేవి. ఇప్పుడెంత మార్పు?


టీ.వీ. కట్టేసి బెడ్‌రూంలోకి నడిచాడు సుధామ.

పనులన్నీ తీర్చుకుని, పడకగదిలోకొచ్చిన భార్యతో... "కొన్ని రోజులు చుట్టాలిళ్ళకు వెళ్ళొద్దామా? వచ్చేవారం మా బావగారబ్బాయి ఒడుగు కూడా చూసినట్టుంది."

"సెలవు దొరకదన్న సాకుతో కుటుంబంలోని ఎన్నో పెళ్ళిళ్ళు ఎగ్గొట్టిన మీరు,

## ఇదేం థ్రిల్లు!

**రాం**గోపాల్ వర్మ నిర్మించిన 'వాస్తు శాస్త్ర' (తెలుగులో మర్రిచెట్టు) సినిమా ట్రయల్ షోకి కొంతమందికి ఆహ్వానమొచ్చింది. సరేననుకున్నారు వారంతా. కానీ షో టైం చూసి వీపున చరుచుకోవడం వారి వంతయింది. అది భయంకరమైన సినిమా కాబట్టి అర్ధరాత్రి దాటిన తరువాత చూస్తే మజాగా ఉంటుందని రాంగోపాల్ వర్మ ఉద్దేశమట. దాంతో ఆ సినిమా అక్టోబర్ 21 అర్ధరాత్రి వేసి చూశారు. కానీ వెళ్ళి చూసినవాళ్ళు మాత్రం తక్కువమందేనట!



ఇప్పుడు ఒడుక్కి రమ్మనడం ఎంతో విడ్డూరమండీ? ఇప్పుడు మీకు తీరుబాటున్నా నాకుండొద్దూ? అబ్బాయి, కోడలు, ఇద్దరూ ఉద్యోగస్తులేనాయె. మనిద్దరం ఊరెళితే పిల్లల నెవరు చూస్తారు?"

"నిజమే రాజ్యం. దేనికైనా పెట్టి పుట్టాలి. బాధ్యతగల హోదాలో సెలవులు దొరకడం కష్టమయ్యేది. నీవెంత పోరినా, నీతో పాటు శుభకార్యాల్లో పాలు పంచుకునే యోగం లేకపోయింది. అందుకని నువ్వొక్క దానివే వెళ్ళాల్సొచ్చేది. నాకైతే ఇప్పుడు కావలసినంత తీరుబడి కాని నీ కిప్పుడు వీలుకాదు. ఏం చేస్తాం? సరే, నేనొక్కణ్ణే కొన్ని రోజులు చుట్టాలిళ్ళు చుట్టివస్తాను.

❋ ❋ ❋

చుట్టాలిళ్ళల్లో కూడా తన పట్ల గౌరవం తగ్గినట్టనిపించింది సుధామకు. మనసు చివుక్కుమంది. వారం రోజులనుకున్న చోట మూడురోజులు, మూడు రోజులనుకున్న చోట ఒక్కరోజు ఉండి తొందరగానే ఇంటికి తిరిగివచ్చాడు. రోజంతా ఇంట్లో ఉండడం బోరుకొట్టసాగింది సుధామకు. హాయిగా జీవితం గడపడం అంటే పని చేయకపోవడం కాదని అనుభవపూర్వకంగా తెలిసింది సుధామకు. కొన్ని రోజులిలా ఏ వ్యాపకం లేకుండా ఉంటే తనకు పిచ్చెక్కడం ఖాయం. తమ బ్యాంకు ఖాతాదార్లను కలసి, తనకు దగ్గ ఉద్యోగమేదైనా చూసుకోవాలి అనుకున్నాడు సుధామ.

గతంలో తనవల్ల లబ్ధి పొందిన కొందరు టీ, కాఫీలు ఇచ్చి బాగానే మర్యాదలు చేశారు. ఉద్యోగ విషయం కదిపేసరికి మాటలు నాన్చసాగారు. అందరూ ఉదయించే సూర్యుణ్ణే పూజిస్తారని, మరో మారు రుజువైంది. ధైర్యం వీడలేదు సుధామ. కొంత పైరవీ చేసి ఒక పెద్ద కార్పొరేట్ సంస్థలో ఆర్థిక సలహాదారుడుగా చేరాడు.

పేరుకు హోదా పెద్దదే కాని క్లర్కు నుండి మానేజరు వరకు అన్ని పనులూ తనే చేసుకోవాలి. తనకెవరూ, అసిస్టెంట్లు లేరు. సరియైన కాబిన్ కూడా లేదు. అయినా సర్దుకు పోవాలి. తప్పదు బ్యాంకులో దీర్ఘానుభవం ఉంది. కాబట్టి బ్యాంకు వ్యవహారాలన్నీ తనే చూడాలి. లోన్లకై అవసరమయ్యే స్టేట్‌మెంట్లు తయారు చేయడం, వాటి మంజూరుకై సంప్రదింపులు, పైరవీలు చేయడం, వివిధ అధికార్లను కలుసుకుని తమ సంస్థ సంబంధాలు సాఫీగా ఉండేట్టు చూడడం, నెల, మూణ్నెల్లు, ఆర్నెల్లు ఇలా ఎప్పటికప్పుడు బ్యాంకుకి ఇవ్వవలసిన వివరాలు కూర్చడం, ఇలా అన్ని బాధ్యతలు తనపైనే. రోజుకు పది గంటలు ఆఫీసు పనితోనే సరిపోతున్నాయి. బ్యాంకులో మానేజరుగా గౌరవం ఇచ్చిన బ్యాంకు సిబ్బంది, ఖాతాదారుని ప్రతినిధిగా వచ్చేసరికి, తమ సహజసిద్ధ దాబు, దర్పం ప్రదర్శించసాగారు. చిన్న ఉద్యోగిని కూడా సార్ అని మన్నించాల్సొచ్చింది. ఇంతా చేసినా పనులు త్వరగా కావడం లేదని యం.డి. సణుగుడు. తను మానేజరుగా ఉన్నప్పుడు నంగినంగిగా ఎంతో గౌరవం ప్రదర్శించి, తనతో ఎన్నో పనులు చక్కబెట్టుకున్నవాడు, ఇప్పుడు తన ఉద్యోగిగా చులకన భావంతో చూస్తున్నాడు. అప్పుడప్పుడు పరోక్షంగా అవమానిస్తున్నాడు. కొన్ని నెలల తర్వాత బ్యాంకులోను పెంచమని పోరు. కంపెనీ వ్యవహారాలు చూస్తే అంత సజావుగా లేవు. ప్రస్తుతం తీసుకున్న అప్పుల వడ్డీ, కిస్తులు కట్టడమే గగనమౌతోంది. క్రితం తీసుకున్న లోన్లతో యం.డి. సొంత ఆస్తులు కూర్చుకున్నాడు. అలా కంపెనీ డబ్బు మళ్ళించడంతో కంపెనీ వర్కింగ్ కాపిటల్ తగ్గింది. ఉత్పాదని తగ్గింది. పర్యావసానంగా కంపెనీ ఆర్థిక పరిస్థితి క్షీణించ సాగింది.

అలాంటి సందర్భంలో కంపెనీకి కొత్త లోను దొరకడం అసాధ్యం. తప్పుడు లెక్కలు చూపించి, కొత్త లోనుకు ప్రయత్నం చేయమని యం.డి. ఒత్తిడి. ఇది ఊహించని మలుపు. ఒకవైపు తనకు జీవితమిచ్చిన సంస్థ, ఇంకోవైపు ప్రస్తుతం జీతం ఇస్తున్న కంపెనీ. ఒకరికి న్యాయం చేస్తే ఇంకొకరికి అన్యాయం చేసినట్టవుతుంది. తను ఉద్యోగంలో చేరింది భుక్తికి లేక కాదు. ఒక వ్యాపకంకోసం, తన అనుభవానికి సార్థకత చేకూర్చడంకోసం తను ఈ సంస్థలో చేరాడు. ఇప్పుడీ పరిస్థితి? తన అంతరాత్మను చంపుకోలేక ఉద్యోగానికి రాజీనామా చేశాడు సుధామ.

ఆ రోజు రాత్రి తీవ్రంగా ఆలోచించాడు. మాటి మాటికి తన గత వైభవాన్ని తలచుకుంటూ ప్రతీదీ భూతద్దంతో చూస్తున్నాడా? ఎదుటివారు మామూలుగానే ఉన్నా, వారు తనని చులకనగా చూస్తున్నారని అపోహపడుతున్నాడా? ఎటూ తేల్చుకోలేకపోతున్నాడు.

ఒక్కొక్కటిగా తన జీవిత మజిలీలు సినిమా రీళ్ళుగా కళ్ళముందు కదులుతున్నాయి. స్కూల్ ఫైనల్‌లో డిస్టింక్షను వచ్చినా ఇంటర్‌లో అత్తెసరు మార్కులతో గట్టెక్కాడు. తనకు సరియైన కోచింగ్ తీసుకునే స్తోమత లేకపోవడం దానికి ప్రధాన కారణం. అందుకని, డాక్టరు కావాలని సైన్సు బై.పి.సి. తీసుకున్న తను బి.ఎస్సీలో చేరవలసివచ్చింది. ఎంతో కష్టపడి బి.ఎస్సీ.లో ఫస్ట్‌క్లాస్ తెచ్చుకున్నాడు.

ఇంకా పై చదువులు చదివే పరిస్థితిలేక, పోటీ పరీక్షలపై దండయాత్ర మొదలు పెట్టాడు. రెండుసార్లు ఫెయిలయినా, మూడోసారి అదృష్టం వరించింది. స్టేట్ బ్యాంక్‌లో ఉద్యోగం వచ్చింది. ఉద్యోగరీత్యా ఎన్నో చోట్ల తిరగడం, బ్యాంకు పరీక్షలు పాసై ప్రమోషన్లు పొందడం. అలా ముప్ఫై ఏళ్ళు సాగిన ఉద్యోగ పర్వం స్వచ్ఛంద పదవీ విరమణతో ముగిసింది. ఆ తర్వాత మూన్నెళ్ళ ముచ్చటగా సాగిన ప్రైవేటు ఉద్యోగం వదులుకోవాల్సిన పరిస్థితులు. ఇప్పుడేం చేయాలి? పెద్ద ప్రశ్న చిహ్నం కళ్ళముందుకొచ్చింది. పదవీ విరమణ అయింది కానీ జీవిత విరమణ కాలేదుగా! ఆరోగ్యం బేషుగ్గా వుంది. ఇంకా పని చేసే సత్తా ఉంది. పని అంటే డబ్బులొచ్చే పనే చేయాలా? తనకు మంచి వ్యాపకంతో పాటు తృప్తి కూడా ఇచ్చే పనేమిటి? మార్గం కనిపించింది. స్వచ్ఛంద పదవీ విరమణను, స్వచ్ఛంద సేవ చేస్తూ పొడిగిస్తే, అవును. అదే మంచిది. తమ కాలనీకి ఆవల కొన్ని కార్మికుల గుడిసెలున్నాయి. వారి పిల్లలు స్కూలుకు వెళ్ళకుండా, చిన్నా చితకపనులు చేస్తారు. కొందరు ఆకతాయిగా తిరుగుతారు. అలాంటి వారికి చదువు చెబితే? వారిలో చురుకైన వారికి ప్రైవేటుగా ఎస్.ఎస్.సి.కి కూర్చోబెట్టవచ్చు. సరి అయిన కోచింగు లేక తను ప్రొఫెషనల్ కోర్సులో చేరలేకపోయాడు.

తన చదువు, అనుభవం కొందరికైనా అక్కరకు రావాలి. సేవాభావంతో, చిత్తశుద్ధితో పనిచేసి, మట్టిలోని మాణిక్యాలను వెలికి తీయాలి.

తన ఆలోచనకు కార్యరూపం ఇచ్చే పథకం కూడా త్వరగా తయారు చేయాలి. ఉద్యోగ రీత్యా ఎన్నో ప్రజాహిత పథకాలు అమలు పరచిన తనకు, తన ఈ పథకం విజయవంతమౌతుందనే నమ్మకం ఉంది. అది అమలులో పెట్టడానికి తనలాంటి కొందరు వి.ఆర్.ఎస్. బాధితుల సహాయం తీసుకోవాలని కూడా అనుకున్నాడు సుధామ. అలా అనుకోగానే మనసు ప్రశాంతమైంది. హాయిగా నిద్రలోకి జారుకున్నాడు మన కథానాయకుడు సుధామ. ❋

